

వణికిన.. ఉత్తరం..!



బెళగావి జిల్లాలో నీట మునిగిన ఆంజనేయ స్వామి ఆలయం



జలమయమైన తీర గ్రామాలు

- ఉత్తర కన్నడ, తీరప్రాంత జిల్లాల్లో పోటెత్తిన వరద
- నీట మునిగిన పది వంతెనలు
- జలదిగ్బంధంలో పలు గ్రామాలు
- కృష్ణా, కావేరీ తీర ప్రాంతాలు జలమయం..

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం నెలకొంది. బెంగళూరు ప్రాంతంలో మేఘావృతం కొనసాగుతున్నా తీర ప్రాంత జిల్లాలతో పాటు ఉత్తరకర్ణాటక ప్రాంతంలో వర్షాలు కుదిపేస్తున్నాయి. దీంతో పాటు మహారాష్ట్ర నుంచి వస్తున్న వరద కారణంగా మరింత ఉధృతంగా తయారయ్యింది. మలెనాడు ప్రాంతంలో 10నదులు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తుండగా ఎనిమిది వంతెనలు నీట మునిగాయి. పలు చోట్ల భూమి కృంగిపోయింది. మహారాష్ట్ర, బెళగావి జిల్లాలలో భారీ వర్షాలతో కృష్ణా, దూద్‌గంగా, వేదగంగా, ఘటప్రభ, హిరణ్యకేశి, మలప్రభ, మార్కండేయ నదులు పొంగి పొర్లుతున్నాయి. కృష్ణానదికి 93వేల క్యూసెక్కుల నీరుపోటెత్తుతోంది. నిప్పాణి, చిక్కోడి ప్రాంతంలో ఎనిమిది బ్రిడ్జిలు జలావృతం అయ్యాయి. నిప్పాణి తాలూకా కారదగా గ్రామం బంగాలి బాబా దర్గా, యక్సంబాద ముల్లన్నక్కి దర్గా, కల్లోళ దత్త దేవాలయం, నరసింహవాడి శ్రీదత్త దేవాలయాలు మునిగిపోయాయి. హాల్యాత్రి కాలువ పొంగి ప్రవహిస్తుండటంతో 15 గ్రామాలకు సంచారం లేకుండా పోయింది. ఖానాపుర నుంచి గోవాకు వెళ్ళే మార్గం నిలిచిపోయింది. హిడకల్ జలాశయంలో ఒకే రోజున ఐదు అడుగుల నీటిమట్టం పెరిగింది. మలెనాడు ప్రాంతంలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుంగా, భద్రా, హేమావతి నదులకు నీరు పోటెత్తుతోంది. శృంగేరి తాలూకా నెమ్మార్ సమీపంలో మట్టి చరియలు విరిగి పడ్డాయి. చార్మాడి ఘాట్ ప్రదేశంలో మంచువాతావరణం నెలకొంది. వాహనాల ప్రయాణం కష్టంగా మారింది. శివమొగ్గ జిల్లా ఆగుంబె కుందాద్రి వద్ద భారీ చెట్టు రహదారిపై విరిగి పడడంతో ప్రయాణానికి ఇబ్బందులు పడ్డారు. అంజనాపుర జలాశయం నిండు కుండలా మారింది. కావేరి నదికి అనుబంధమైన హేమావతి నది నుంచి కాలువలకు 15వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మలెనాడు, చిక్కమగళూరు జిల్లా పరిధిలో భారీగా వర్షాలు నమోదవుతున్నాయి. కావేరి నదికి అనుబంధంగా మండ్య జిల్లాలోని కేఆర్‌ఎస్ జలాశయానికి వరద పోటెత్తుతోంది. గరిష్ట మట్టానికి కేవలం నాలుగు అడుగులు మాత్రమే ఉండటంతో 50వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కబిని నుంచి 15వేల క్యూసెక్కులు, హారంగి నుంచి పదివేల క్యూసెక్కులు విడుదల చేశారు. హాసన్, బెళగావి, ఉత్తరకన్నడ, చిక్కమగళూరు జిల్లాల పరిధిలో వర్ష ప్రభావం ఉండే 14 తాలూకాల పరిధిలో గురువారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. కావేరి నదికి అనుబంధంగా బన్నూరు హోబళి మాకనహళ్ళికు చెందిన కృష్ణగౌడ, ప్రవీణ్ అనే తండ్రీ కొడుకులు పశువులను మేపేందుకు వెళ్ళి వరదలో చిక్కుకుపోగా స్థానికులు రక్షించారు. మరో మూడు రోజులపాటు ఏడు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఉత్తరకన్నడ జిల్లా జోయిడా తాలూకా పరిధిలో అవేరి గ్రామ పాఠశాల పైకప్పులు ఎగిరిపోయాయి. పాఠశాలకు సెలవు కావడంతో విద్యార్థులు ఎవరూ లేక ప్రమాదం తప్పినట్లు అయ్యింది.



ఉత్తర కన్నడ జిల్లా జోయిడా తాలూకాలో ఈదురు గాలులకు కొట్టుకుపోయిన పాఠశాల పైకప్పు



నిప్పాణి సమీపంలో వంతెనపైన ప్రవాహం..



ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

నాతోనే.. మాట్లాడండి..!

- బహిరంగ వ్యాఖ్యలతో రచ్చ చేయవద్దు
- ఎమ్మెల్యేలపై సీఎం ఆగ్రహం
- పాటిల్, రాజుకాగెతో చర్చలు
- అధిష్టానం హెచ్చరికతో రంగంలోకి ముఖ్యమంత్రి..



బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సొంతపార్టీ ఎమ్మెల్యేలు వరుసగా చేస్తున్న ఆరోపణలతో అధిష్టానం ఉక్కిరిబిక్కిరి అయ్యింది. వ్యతిరేకతను తీవ్రంగా పరిగణించిన పెద్దలు సీఎం సిద్దరామయ్యను వెంటనే జోక్యం చేసుకోవాలని, మరింత జాప్యం సరికాదని లేదంటే మేం రంగంలోకి దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో రెండు రోజుల ఢిల్లీ పర్యటన ముగించుకుని బుధవారం సాయంత్రం బెంగళూరుకు చేరుకున్న సీఎం సిద్దరామయ్య అందుబాటులో ఉండే నేతలతో చర్చలు జరిపారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. కలబురిగి జిల్లా అలంద నియోజకవర్గంలో బీఆర్ పాటిల్ సూచించిన జాబితాను కాదని సర్పంచులు ఇచ్చిన జాబితాకు అనుగుణంగా హౌసింగ్ లబ్దిదారులను ఎంపిక చేయడమే వివాదంగా మారింది. ఈమేరకు బీఆర్ పాటిల్ బుధవారం సాయంత్రం డీసీఎం డీకే శివకుమార్‌ను కలిశారు. ఆతర్వాత సీఎం సిద్దరామయ్య పిలుపు మేరకు వెళ్ళి వివరణ ఇచ్చారు. ఇదే సమయానికి గృహనిర్మాణ శాఖా మంత్రి జమీర్ అహ్మద్‌ను పిలిపించి చర్చలు జరిపారు. దీంతో సమస్య సద్దుమణిగింది. సీఎంను కలిసిన తర్వాత బీఆర్ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ హౌసింగ్ లబ్దిదారుల ఎంపికలో జరిగిన అవినీతి విషయాన్ని సీఎంకు వివరించానన్నారు. తదుపరి నిర్ణయం ముఖ్యమంత్రిదే అన్నారు. ఆళంద నియోజకవర్గంలో రూ.15 కోట్లతో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మిస్తున్నామన్నారు. కానీ కల్యాణకర్ణాటక అభివృద్ధి మండలి ద్వారా మైనార్టీ విభాగానికి రూ. 17 కోట్లతో రెసిడెన్షియల్ పాఠశాల నిర్మిస్తున్నారన్నారు. కనీసం ప్రోటోకాల్ పాటించలేదని శంకుస్థాపనకు ఆహ్వానించలేదన్నారు. వీటన్నింటిపైనా సీఎం చర్చలు జరుపుతానని చెప్పారన్నారు. బెళగావి జిల్లా కాగవాడ ఎమ్మెల్యే రాజు కాగె కూడా అభివృద్ధి పనులు చేయలేక పోతున్నామని రెండురోజులలో రాజీనామా చేస్తానంటూ చేసిన వ్యాఖ్యల మేరకు సీఎం నేరుగా రాజుకాగెతోను చర్చలు జరిపారు. కాగా మొళకాల్మూరు ఎమ్మెల్యే వైఎన్ గోపాలకృష్ణతో త్వరలోనే చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఇకపై ఇలాంటి వన్నీ మానుకోవాలి..

ఎమ్మెల్యేలు బహిరంగ విమర్శలకు దిగిన తరుణంలోనే సీఎం సిద్దరామయ్య పలువురితో చర్చలు జరిపాక పార్టీ ఎమ్మెల్యేలందరినీ తీవ్రంగా హెచ్చరించారు. సమస్య ఉంటే ముందు తనతో మాట్లాడలంటూ ఆదేశించారు. ఎవరికి వారుగా మీడియా ముందుకెళితే క్షమించేది లేదన్నారు. ఇకపై బహిరంగంగా పార్టీ లేదా ప్రభుత్వానికి సంబంధించిన అంశాలపైనా బహిరంగ వ్యాఖ్యలు చేయరాదన్నారు.



డీసీఎంతో బీఆర్ పాటిల్

బ్యాంక్ మేనేజరే సూత్రధారి..!

- విజయపుర బ్యాంక్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- 10 కిలోలకు పైగా బంగారం స్వాధీనం
- హాలీవుడ్ సినిమాలు చూసి చోరీకి స్కెచ్

బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం అనిపించిన భారీ బ్యాంక్ చోరీని పోలీసులు ఛేదించారు. విజయపుర జిల్లా మనగోళి కెనరా బ్యాంక్‌లో జరిగిన భారీ చోరీలో బ్యాంక్ మేనేజర్‌నే సూత్రధారిగా పోలీసులు తేల్చారు. గురువారం విలేకరుల సమావేశంలో విజయపుర జిల్లా ఎస్పీ లక్ష్మణ నింబరగి తెలిపిన వివరాల మేరకు ఇదే కెనరా బ్యాంక్ బ్రాంచ్‌లో పనిచేసి ఇటీవలే హుబ్బళి నగరం గదగ్‌రోడ్‌లోని కోఠారి నగర కెనరా బ్యాంక్‌కు బదిలీపై వెళ్ళిన మేనేజర్ విజయ్‌కుమార్ మిరియాల(41)తో పాటు హుబ్బళ్ళి జనతా కాలనీ వాసి, ప్రైవేటు కంపెనీలో పనిచేసే చంద్రశేఖర్ నేరెల్లా(38) హుబ్బళి చాళుక్య నగరం సునీల్ మోకా(40)లను అరెస్టు చేశారు. 10.75 కోట్ల విలువైన 10.5 కేజీల బంగారం స్వాధీనం చేసుకున్నారు. రెండుకార్లను స్వాధీనం చేసుకున్నారు. మేనెల 23న నుంచి బ్యాంకుకు సెలవులు ఉండటంతో పథకం ప్రకారం చోరీకు పాల్పడ్డారు. బ్యాంకు సేఫ్ లాకర్‌లో ఉన్న 53.26 కోట్ల విలువైన 58.97 కేజీల బంగారు ఆభరణాలు, రూ.5.20 లక్షల నగదు చోరీ చేశారు. మూడునెలల కాలంగా వారు చోరీకి ప్రయత్నించారు. ఇదే బ్యాంకులో పనిచేసిన మేనేజర్‌కు లాకర్‌తో పాటు ఇతరత్రా సమాచారం తెలవడంతో సునాయాసంగా చోరీకి పాల్పడ్డారు. బంగారం, నగదును ఒకేసారి చోరీ చేసి తీసుకెళ్ళిన వారు సీసీ పుటేజీల్లో ఆధారాలు లభించకుండా హార్డ్ డిస్క్‌లనూ పట్టుకెళ్ళారు. బ్యాంకు చోరీల వీడియోలను చూసేవారని పలు బాలీవుడ్, హాలీవుడ్ సినిమాలను చూసి చోరీకి ప్లాన్ వేసినట్లు ఎస్పీ తెలిపారు. మిగిలిన బంగారంపై ఆరా తీస్తున్నామన్నారు.



అరెస్ట్ అయిన నిందితులు

మార్పులకు వేళాయె..!





- కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షుల మార్పునకు ప్రయత్నాలు
- కమలం సారథిగా సునీల్ కుమార్...!
- హస్తం బాధ్యతలు ఉత్తర ప్రాంతం వారికే..

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కీలకమైన కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షుల మార్పులకు ముహూర్తం కుదిరినట్లుంది. ఆదిశగానే అధిష్టానం కూడా దిశా నిర్దేశం చేస్తుండటంతో ఎప్పుడైనా ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్, బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్రల మార్పులు తప్పేలా లేవు. రెండు ప్రధాన రాజకీయ పార్టీలు జాతీయ స్థాయిలోను కీలకమే అయినా దక్షిణభారత్‌కు రెండు పార్టీల మనుగడ కూడా కీలకంగానే ఢిల్లీ పెద్దలు భావిస్తున్నారు.

కమలంలో తీవ్రమైన వర్గపోరు..!



సునీల్ కుమార్

బీజేపీ అధ్యక్షుడిగా విజయేంద్ర ఒక పర్యాయం పూర్తీ చేశారు. రెండో విడత కొనసాగేందుకు తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు. కానీ రాష్ట్రంలో ఆయనకు వ్యతిరేక వర్గం ఏర్పడటం, వారు విజయేంద్ర మార్పు మినహా మరో అజెండా లేదనే రీతిలో వ్యవహరిస్తుండటంతో అధిష్టానం కూడా మార్పు దిశగానే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర బీజేపీ అభివృద్ధికి యడియూరప్ప నాయకత్వమే కారణంగా చెప్పవచ్చును. దశాబ్దాల పాటు పార్టీని భుజాలపై మోసి శూన్యం నుంచి అధికారంలోకి తీసుకువచ్చేదాకా చేశారు. ఆయనకు వయస్సు పైబడిందనే కారణంతోనే ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించారు. కానీ ఆయన కుమారుడు విజయేంద్రను పార్టీ అధ్యక్షుడిని చేశారు. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇదే విషయమై సీనియర్‌నేతలతో చర్చించినట్లు తెలుస్తోంది. దీంతో కేంద్ర మంత్రి సోమణ్ణ పేరు కూడా ప్రస్తావనకు వచ్చింది. మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై పేరు గత కొన్ని నెలలుగా వినిపిస్తోంది. ఇలా సాగుతుండగానే అధిష్టానం పెద్దలు ఢిల్లీకు రావాలని పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్‌లకు సూచించడంతో వారిద్దరూ రెండు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేశారు. అనూహ్యంగా అందరి పేర్లు పక్కన పెట్టిన అధిష్టానం ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పేరు తెరపైకి వచ్చింది. వాస్తవానికి లింగాయతులకే అధ్యక్ష పదవి కట్టబెడతారనే చర్చలు సాగుతున్నా అందుకు భిన్నమైన పేరును తెరపైకి తెచ్చారు. ఉడుపి జిల్లా కార్కళకు చెందిన హిందుత్వ వాది వి సునిల్‌కుమార్‌కు ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్‌కు చెందిన పలువురి ఆశీస్సులు ఉన్నాయి. అందరితోను కలుపుకుపోయే తత్వంతో పాటు పార్టీ కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధమనేలా ఆయన వ్యవహరిస్తుంటారు. దీంతో సునీల్ పేరు ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. బిల్లవ సమాజానికి చెందిన సునిల్‌కుమార్ పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి ఇటీవలే రాజీనామా చేశారు.

హస్తం బాధ్యతలు ఉత్తర ప్రాంతం వారికే..



సతీష్‌జార్కిహోళి ఎంబీ పాటిల్ ఈశ్వర్‌ఖండ్రే

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష హోదాకు కొత్తవారిని నియమించాలనే ఆలోచన వెనుకు భారీ వ్యూహాలు ఉన్నట్లు అనిపిస్తోంది. ప్రస్తుతం అధ్యక్షుడిగా డీకే శివకుమార్ వ్యవహరిస్తున్నారు. ఆయన కేపీసీసీ సారథితో పాటు డీసీఎంగాను బెంగళూరు నగరాభివృద్ధి, జలవనరుల శాఖల మంత్రిగాను కొనసాగుతున్నారు. రెండున్నరేళ్ళకు నాయకత్వం మార్పు అనివార్యమైతే అప్పుడు తప్పనిసరిగా డీకే శివకుమార్ హోదాను కోల్పోవలసి వస్తుంది. వాస్తవానికి డీకే శివకుమార్ డీసీఎం పదవి చేపట్టిన రెండేళ్ళకిందటే మార్పు ఉంటుందని భావించారు. కానీ అధిష్టానం ససేమిరా అంది. ఇటీవల పలుమార్లు అధ్యక్ష పదవి మారుతుందని ప్రత్యేకించి సీనియర్ మంత్రి సతీష్ జార్కిహోళి పదేపదే వ్యాఖ్యానిస్తూ ఉన్నారు. ఎట్టకేలకు అధిష్టానం కూడా మార్పునే కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. తరచూ పదవులన్నీ బెంగళూరు ప్రాంతానికి చెందినవారికే వరిస్తాయనే పేరుంది. దీంతో ఉత్తరకర్ణాటక వాసులలో ఒకరికి హోదా అప్పగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో ప్రధానంగా మంత్రులు ఎంబీ పాటిల్ లేదా ఈశ్వర్‌ఖండ్రేల్లో ఒకరికి వరిస్తుందనే చర్చలు ఉన్నాయి. వీరిద్దరు కాని పక్షంలో సతీష్ జార్కిహోళికు వరించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి మార్పు ఏడాది ఆఖరులోగా ఉంటుందనే సంకేతాలు పరోక్షంగా అధిష్టానమే ఇస్తున్నట్లు అనిపిస్తోంది. రెండేళ్ళ పాలన తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని భావిస్తున్న తరుణంలో మరో ఐదునెలల పాటు ఎవరూ మాట్లాడరాదని హెచ్చరించడంతో పాటు కేపీసీసీ అధ్యక్షుడి మార్పునకు సిద్ధం కావడం కూడా సంకేతాలు అనిపిస్తున్నాయి. తాజాగా మంత్రి రాజణ్ణ గురువారం మీడియాతో మాట్లాడుతూ ఆగస్టులో కీలక మార్పులు జరుగనున్నాయనేది అంశం కూడా పరిగణలోకి తీసుకోక తప్పదనిపిస్తోంది.

నో చాన్స్..!

- ఈశ్వరప్ప, యత్నాళ్‌ను మళ్లీ పార్టీలోకి తీసుకోం
- బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్



బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సస్పెన్షన్ వేటు పడిన ఈశ్వరప్ప, ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌లను మళ్ళీ బీజేపీలోకి తీసుకునేది లేదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ రాధా మోహన్ దాస్ అగర్వాల్ అన్నారు. మంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడిన మేరకు వారిద్దరినీ సస్పెండ్ చేశామన్నారు. ఇద్దరిపైనా ఆరేళ్ళపాటు నిషేధం ఉందన్నారు. వారిద్దరూ తమ పార్టీలో లేరన్నారు. బీజేపీ సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. క్రమశిక్షణ లేని వారిని, పార్టీ ఉనికికి భంగం కలిగించేలా వ్యవహరించిన వారిని మళ్ళీ పార్టీలోకి తీసుకునేది లేదన్నారు. కాగా ఈశ్వరప్ప ఒకప్పుడు రాష్ట్రంలో తిరుగులేని నేతగా కొనసాగారు. డీసీఎం పదవిలోను ఉన్నారు. కానీ 2024 లోక్‌సభ ఎన్నికల వేళ శివమొగ్గనుంచి రెబల్‌గా పోటీ చేయడంతో సస్పెన్షన్ వేటు పడింది. కానీ ఇటీవల యడియూరప్ప మనవడి పెళ్ళివేడుకలలో పాల్గొనడంతో పాటు యడియూరప్ప తనకు పెద్దన్న వంటివారని వ్యాఖ్యానించారు. ఇక ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ పార్టీలో గ్రూపు ఏర్పాటు చేస్తున్నారని, పార్టీ అధ్యక్షుడితో వ్యతిరేకంగా ఉన్నారని అధిష్టానం వేటు వేసింది. పార్టీకి ఫైర్ బ్రాండ్‌గా పేరొందిన యత్నాళ్ మరోసారి అవకాశమిస్తే తిరిగి వస్తారని కానీ విజయేంద్ర అధ్యక్షుడిగా ఉండేంత దాకా సాధ్యం కానిదనే అభిప్రాయాలు పార్టీలో ఉన్నాయి. ఇలా ఇద్దరినీ మళ్ళీ పార్టీలోకి చేర్చుకునేది లేదని పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ తేల్చడం వారికి షాక్ ఇచ్చినట్లు అయ్యింది. ఇప్పటికే వర్గపోరుతో విలవిలలాడుతున్న పార్టీలో అసంతృప్తులకు షాక్ ఇచ్చినట్లయ్యింది. క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవు అన్నట్లు తేల్చినట్లుంది.

మాయదారి మందులు..!



- సురక్షితం కాని జాబితాలో 15 ఔషధాలు
- ఆరోగ్యశాఖ ప్రకటన

7

బిరబిరా కృష్ణమ్మ..!

రాయచూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. ఆల్మట్టి డ్యాం నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో కాల్వల్లో నీటి ప్రవాహం పెరిగింది. గురువారం నారాయణపూర్ జలాశయం నుంచి దిగువకు 52 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. నారాయణపూర్ జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి 67వేల క్యూసెక్కులు వచ్చి చేరడంతో 52 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఆల్మట్టి జలాశయం నుంచి దిగువకు విడుదలయ్యే నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు దిగువకు నీటి విడుదల చేశారు. రాగల రెండు రోజుల్లో నదిలో నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు. నదీ తీర ప్రాంతాలు ప్రజలు, లోతట్టు ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఆల్మట్టి డ్యాం నుంచి దిగువకు వస్తున్న నీరు

వద్దనుకున్నారా... వదిలేశారా?

● నాలుగు రోజులుగా బ్యాంకు వద్ద ద్విచక్రవాహనం

విడపనకల్లు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంక్ వద్ద గుర్తు తెలియని ద్విచక్రవాహనం నాలుగు రోజులుగా ఉంది. దీన్ని గమనించిన స్థానికులు విడపనకల్లు పోలీసులకు సమాచారం అందించా రు. ఎస్ఐ ఖాజాహుస్సేన్ ద్విచక్రవాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. ఈ ద్విచక్రవాహనం నంబరు(ఏపీ 02కే 2940) ఆధారంగా పరిశీలించగా గార్లదిన్నె మండలం కొప్పలకొండ గ్రామానికి చెందిన కే రామన్న అనే వ్యక్తి పేరున రిజిస్టర్ అయి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. వాహన యజమానులు రికార్డులతో విడపనకల్లు పోలీస్ స్టేషన్‌కు రావాలని ఎస్ తెలిపారు.


వదిలి వెళ్లిన ద్విచక్రవాహనం

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

బొమ్మనహాళ్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన పూజ(19) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బొమ్మనహాళ్ పోలీసులు తెలిపిన మేరకు బళ్లారికి చెందిన జ్యోతి, సన్న ఈరప్ప దంపతుల కుమార్తె పూజ(19)ను కుడితినికి చెందిన రాజేష్‌కు ఇచ్చి ఆరునెలల కిందట వివాహం చేశారు. వీరు కొంతకాలం నుంచి మండల కేంద్రంలోని దాసరి రామ్మూర్తి అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు ఉంటూ పాత్ర వస్తువులు వ్యాపారం చేసుకుంటూ జీవించేవారు. ఏం జరిగిందో తెలియదు కాని ఈ నెల 19న రాత్రి దోమల నివారణకు ఉపయోగించే ద్రావకాన్ని తాగి పూజ ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలు గతంలో మూర్ఛవ్యాధితో మతిస్థిమితం కోల్పోయి ప్రవర్తిస్తుండేదని మృతురాలి తల్లి జ్యోతి ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. శవానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటకలో తూమకుంట యువకుడి హత్య

హిందూపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కుడుమలకుంట సమీపంలో గురువారం సాయంత్రం హిందూపురం మండలం తూమకుంటకు చెందిన రవికుమార్(35) హత్యకు గురయ్యాడు. తూమకుంటకు చెందిన ఉప్పర రవికుమార్ పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కానీ కొంతకాలంగా వారికి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం సరిహద్దులోని బార్ వద్ద మద్యం సేవించి ఓ వ్యక్తితో గొడవ పడ్డాడు. ఈ గొడవలో రవికుమార్‌ను మద్యం బాటిల్‌తో పొడిచి హత్య చేశారు. గౌరీబిదునూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గౌరీబిదనూరు రూరల్ పోలీసులు తెలిపారు. కాగా రవికుమార్‌ను హత్యచేసిన నిందితున్ని తొండేబావి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.


రవికుమార్ (ఫైల్)

వారిని తీసేయండి

● అధికారులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడి

యల్లనూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో గత ప్రభుత్వం నుంచి ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్‌షాపు డీలర్లుగా కొనసాగుతున్న వారిని తొలగించాలని అధికారులపై ఒత్తిడి ఎక్కువైనట్లు తెలుస్తోంది. సాధారణ బదిలీల్లో భాగంగా వచ్చిన అధికారులు సీట్లో కూర్చొని పదిరోజులు కాకముందే అధికార పార్టీ నాయకుల నుంచి ఒత్తిడి వస్తుండటంలో వారు తలలు పట్టుకుంటున్నారు. మండలంలోని నాలుగైదు పంచాయతీల్లో రేషన్‌షాపులు నేటికి వైసీపీ వారే నిర్వహిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా కొన్నిచోట్ల పాతవారే కొనసాగుతున్నారు. ఇప్పటికి ఆయా పంచాయతీల్లో వైసీపీ నాయకుల పెత్తనం ఉండడంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇలాంటి వారిని వెంటనే మార్చాలని టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులను గురువారం ఎంపిక చేశారు. స్థానిక కొవ్వూర్‌నగర్‌లోని విద్యారణ్య స్కూల్‌లో జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, పుష్పావతి తెలిపారు. అండర్-10 బాలురలో గౌతమ్‌కృష్ణ, హరియాన్, సాధ్విన్, మోహన్‌కృష్ణ ఎంపిక కాగా బాలికల విభాగంలో అన్వి, అశ్విత, చైత్ర చోటు సాధించారు. అండర్-12 బాలురలో ఫణికుమార్, జశ్విత్‌రెడ్డి, జావీద్, నరేందర్, దుర్గా, బాబాఫకృద్దీన్ ఎంపిక కాగా, బాలికల విభాగంలో ముక్త, లిఖితబాయి, దీక్ష, హిమబిందులు ఎంపికైన వారిలో ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.


ఎంపికైన ఫెన్సింగ్ క్రీడాకారులు

తల నరికేశారు..!

లేపాక్షి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైదుగోళం గ్రామానికి చెందిన బోయ రవికుమార్(37) దారుణ హత్యకు గురయ్యాడు. అతని తలను నరికేసి.. మొండెం నుంచి వేరు చేశారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

డిన్నర్ ఏర్పాటు చేసుకుని..

మైదుగోళం గ్రామానికి చెందిన రవికుమార్ వ్యవసాయంతోపాటు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇదే గ్రామంలోని తన స్నేహితుడు ఆనంద్‌తో కలిసి మంగళవారం రాత్రి డిన్నర్ ఏర్పాటు చేసుకున్నాడు. గ్రామ సమీపంలోని కర్ణాటక ప్రాంతం నుంచి మద్యం, చికెన్ తెచ్చుకున్నారు. చికెన్ వండాలని తన భార్య గీతకు చెప్పి.. రవికుమార్ బయటకు వెళ్లిపోయాడు. గ్రామ సమీపంలోని నీటి గుంత వద్దకు ఆనంద్, రవికుమార్ వెళ్లి మద్యం సేవించి, తిరిగి ఇంటికి వచ్చారు. వండిన చికెన్‌ను తీసుకుని ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో బయటకు వెళ్లిపోయారు. ఆ తరువాత రవి కుమార్ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బుధవారం ఉదయం ఆనంద్‌ను గీత నిలదీసింది. తన భర్త ఎక్కడికి వెళ్లాడని ప్రశ్నిస్తే.. తెలియదని బుకాయించాడు. 'నీతోనే కదా కలిసి వెళ్లింది..? ఏమయ్యాడో తెలియదంటే ఎలా..? చెప్పకపోతే నీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా' అని గీత హెచ్చరించింది. దీంతో 'ఏమైనా చేసుకో.. నాకు సంబంధం లేదు' అని ఆనంద్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రవి కుమార్ ఆచూకీ లభించకపోవడంతో లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో అతని తండ్రి అశ్వర్థప్ప బుధవారం ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు గ్రామ పొలిమేరల్లో గాలిస్తుండగా గురువారం ఉదయం రవికుమార్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రవి కుమార్ తల నరికి నీటి కుంటలో పడేసినట్లు గుర్తించారు. హత్య జరిగిన సమయంలో ఆనంద్‌తోపాటు మరొకరు అక్కడ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హతుడి భార్య ఇచ్చిన సమాచారం ఆధారంగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆ ఇద్దరిలో ఒకరి భార్యతో రవికుమార్ సన్నిహితంగా ఉండేవాడని, వారి మధ్య వివాహేతర సంబంధం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కారణంగానే రవి కుమార్‌ను హత్య చేశారని భావిస్తున్నారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రవి కుమార్ భార్య ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నామని రూరల్ సీఐ జనార్దన్ తెలిపారు.

సిఫార్సు లేఖలతో తలనొప్పి

● ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు కుప్పలు తెప్పలుగా సిఫార్సు లేఖలు

● తలలు పట్టుకుంటున్న యంత్రాంగం


పీఆర్ ఎస్ఈ కార్యాలయం (ఫైల్)

అనంతపురం న్యూటౌన్ జూన్ 26(ఆంధ్రజ్యోతి): బదిలీలకు సంబంధించి సిఫార్సు లేఖలు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారాయి. సచివాలయ సిబ్బంది బదిలీలకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారికి బదిలీ తప్పనిసరి చేసింది. దీంతో కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమకు అనుకూలమైన స్థానాల మీద కన్నేశారు. దాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. అధికార పార్టీ నాయకుల సిఫార్సు లేఖలను బదిలీ దరఖాస్తుకు జత చేసి ఉన్నతాధికారులకు ఇస్తున్నారు. కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న ఈ సిఫార్సు లేఖలే అధికారులకు తలనొప్పిగా మారాయి. ఇప్పటికే ఉన్న స్థానాలు రేషనలైజేషన్‌లో భాగంగా తగ్గిపోయాయి. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చి కొత్తవారిని తెచ్చుకుంటే వారితో పని చేయించుకోవడం కష్టమని అధికారులు భావిస్తున్నారు. పైగా బదిలీలకు సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు అసలు ప్రక్రియే ప్రారంభం కాకపోవడంతో అసలు బదిలీలు జరుగుతాయా? లేదా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

తగ్గిన 300 పోస్టులు

అనంతపురం జిల్లాకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పోస్టులు 483 ఉన్నాయి. ఇందులో 429 మంది పని చేస్తున్నారు. 54 ఖాళీలు ఉన్నట్లు అధికారులు రికార్డులు తయారు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో 420 పోస్టులు ఉండగా 334 మంది పని చేస్తున్నారు. 85 ఖాళీలు ఉన్నట్లు అధికారులు రికార్డులు తయారు చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి రేషనలైజేషన్‌లో 300 పోస్టులు దాక తగ్గిపోయాయి. దీంతో ఆ స్థానాల్లో ప్రస్తుతానికి ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఉన్నా ప్రస్తుత బదిలీల్లో అక్కడ పోస్టులు లేనట్లు చూపిస్తున్నారు. దీంతో మొదటిగా రేషనలైజేషన్‌కు అనుగుణంగా సర్దుబాటు చేసి బదిలీలు చేపట్టాలని సిబ్బంది రాష్ట్ర స్థాయి అధికారుల వద్ద నిరసన తెలుపుతున్నారు. దీంతో పాటు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీటిని పరిష్కరించిన తరువాత బదిలీల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం వీటిని పట్టించుకోకుండా వారి పని వారు చేసుకుపోతున్నారు.

నకిలీ బంగారంతో రుణం.. గుట్టు రట్టు

ముగ్గురు నిందితుల అరెస్ట్

నార్పల ప్రైవేట్ బ్యాంకులో మూడు దఫాలుగా తాకట్టు

రూ.9 లక్షలు పైబడి రుణం పొందిన దుండగులు

నార్పల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో నకిలీ బంగారం ఆభరణాలు పెట్టి రుణం తీసుకొని మోసం చేసిన కేసులో ముగ్గులు నిందితులను నార్పల పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలను సీఐ కౌలుట్లయ్య వెల్లడించారు. నార్పలకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్, యల్లనూరు దాదాపీర్, మహమ్మద్ రఫీలు కలిసి ఇమ్రాన్ పేరు మీద ప్రైవేట్ బ్యాంకులో ఖాతా ప్రారంభించారు. తొలిసారి నాలుగు నకిలీ బంగారు గాజులుపెట్టి రూ. 3,21,693లు, రెండోసారి రెండు నకిలీ బంగారు కడియాలు పెట్టి రూ.3,53,174లు, మూడోసారి మూడు నకిలీ బంగారు గాజులు పెట్టి రుణం తీసుకున్నారు. ఇలా మొత్తం రూ. 9,46,890లు రుణం తీసుకున్నారు. ఈనెల 23న బ్యాంకు గోల్డ్ లోన్ క్లస్టర్ మేనేజర్ కొలంట్ల నాగరాజు ఆడిటింగ్ నిర్వహించారు. ఆ సమయంలో మొత్తం 125.8 గ్రాములు నకిలీ బంగారాన్ని గుర్తించారు. దాని మీద రూ.9,46,890లు లోన్ తీసుకున్నట్లు గుర్తించి నార్పల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలోనే ముగ్గురు నిందితులు మరోసారి నేరం చేసేందుకు ప్రయత్నించగా నార్పల ఎస్ఐ సాగర్, సిబ్బంది గురువారం వారిని అరెస్ట్ చేసి, వారి నుంచి పది బంగారు నకిలీ గాజులు, రెండు బంగారు కడియాలు, మూడు నకిలీ బంగారు ఉంగరాలు, ఒక ద్విచక్రవాహనం, కారును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురితో పాటు మరో ఆరుగురు నేరం చేసినట్లు తమ దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

లక్కు ఎవరికో..!

అనంత ఏడీఏ పోస్టుపై సందిగ్ధత

అనంతపురం అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఏడీఏ పోస్టు భర్తీపై సందిగ్ధత వీడలేదు. పక్షం రోజుల నిరీక్షణ తర్వాత బుధవారం రాత్రి ఆలస్యంగా ఏడీఏ బదిలీల రెండో జాబితాను విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఏడీఏలకు తొలి జాబితాలో కేటాయించిన స్థానాలే ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అనంతపురం, హిందూపురం ఏడీఏ స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. తొలి జాబితాలో హిందూపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్‌ను అనంతపురం ఏడీఏగా, ధర్మవరం ఏడీఏ కృష్ణయ్యను హిందూపురం ఏడీఏగా నియమించారు. అయితే రెండో జాబితాలో అనంతపురం, హిందూపురం ఏడీఏ స్థానాలు ఖరారు చేయకపోవడం తీవ్ర చర్చకు దారితీసింది. తొలి జాబితాలోని కొన్ని స్థానాలు మార్పు చేసిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు అనుమతి కోసం సీఎం కార్యాలయానికి ఫైల్ పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అనంత ఏడీఏ పోస్టు ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ ఆ శాఖ వర్గాల్లో నెలకొంది.

ఏడుగురికి తొలి జాబితాలోని స్థానాలే ఖరారు

ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఏడీఏలకు తొలి జాబితాలోని స్థానాలే ఖరారు చేశారు. అనంతపురం ఏడీఏ రవిని తాడిపత్రికి బదిలీ చేశారు. కదిరి ఏడీఏ సత్యనారాయణను ఉరవకొండకు, తాడిపత్రి ఏడీఏ చెంగల్‌రాయుడును కర్నూలు జిల్లా ఆలూరుకు, మడకశిర ఏడీఏ కృష్ణమీనన్‌ను పెనుకొండకు, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ సనావుల్లాను కదిరికి, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్‌ను ధర్మవరం, ఉరవకొండ ఏడీఏ పద్మాజను రాయదుర్గం ఏడీఏగా బదిలీ చేశారు. దీంతో వారు పాత స్థానాల్లో రిలీవ్ అయ్యారు. ఒకటి, రెండు రోజుల్లో కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

అయిష్టంగా.. ఆవేదనతో..!

దూరప్రాంతాలను కోరుకున్న టీచర్లు

ముగిసిన 1998 ఎంటీఎస్ టీచర్ల కౌన్సెలింగ్

అనంతపురం విద్య, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆందోళనను ఎక్కువ కాలం కొనసాగించలేక దూరప్రాంతాలను అయిష్టంగానే ఆవేదనతో 1998 ఎంటీఎస్ టీచర్లు తీసుకున్నారు. విద్యాశాఖాధికారులు పట్టుదలగా తాము అనుకున్నట్లుగానే ఖాళీలు చూపించి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంటీఎస్ టీచర్లలో చీలికరావడం, 2008 ఎంటీఎస్ టీచర్లు బుధవారం కౌన్సెలింగ్‌కు హాజరుకావడంతో విద్యాశాఖ యంత్రాంగం పట్టుబిగించింది. ఈ నేపథ్యంలోనే మిగిలిన 1998ఎంటీఎస్ టీచర్లను గురువారం కౌన్సెలింగ్‌కు రావాలని విద్యాశాఖ ఆహ్వానించింది. దీంతో వారు మధ్యాహ్నం జిల్లా సైన్స్‌సెంటర్‌కు చేరుకున్నారు. తొలుత అక్కడ సమావేశమై కౌన్సెలింగ్‌కు హాజరవుదామా.. వద్దా అని చర్చించుకున్నారు. అయితే చాలామంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ 'రోజూ ఇక్కడికి రావడం..వెళ్లడం ఏంటీ? మనం కౌన్సెలింగ్‌కు పోదాం. పాఠశాలలు కోరుకుందా. ఇష్టమైతే వెళ్దాం. లేదంటే సెలవు పెడదాం. అదికూడా కాకుంటే వదిలేద్దాం' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అయిష్టతతోనే కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. డీఈఓ ప్రసాద్‌బాబు, ఏఎస్ఓ శ్రీనివాసులు కౌన్సెలింగ్‌కు హాజరైన ఎంటీఎస్ టీచర్లకు ఖాళీలు చూపిస్తూ వారుకోరుకున్న స్కూల్స్‌ను కేటాయించారు. 1998ఎంటీఎస్ టీచర్లు 394మంది హాజరయ్యారు. వీరందరూ దూరప్రాంతాలను అయిష్టంగానే ఆవేదనతో కోరుకున్నారు.

నకిలీ గుడ్‌నైట్..!

ఏరియల్, టైడ్ కూడా..!

విజిలెన్స్ తనిఖీలో బట్టబయలు


గుంతకల్లులోని అంబికా జనరల్ స్టోర్స్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

అనంతపురం క్రైం/గుంతకల్లు టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇతర శాఖల అధికారులు దాడులు నిర్వహించారు. అనంతపురం, గుంతకల్లులోని పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. దోమల నియంత్రణకు వినియోగించే గుడ్‌నైట్ లిక్విడ్ నకిలీ ఉత్పత్తులను అమ్ముతున్నారని హిందూస్తాన్ యూనిలివర్ లిమిటెడ్ సంస్థ ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పదించి, ఈ దాడులు చేశారు. అనంతపురంలోని రాజారాం కిరాణం దుకాణం, సోమేశ్వర్ ట్రేడర్స్, లక్ష్మీ జనరల్ స్టోర్స్, గుంతకల్లులోని అంబికా జనరల్ స్టోర్స్, రాజ్యలక్ష్మి జనరల్ స్టోర్స్, మహాదేవ్ జనరల్ స్టోర్స్, భవాని జనరల్ స్టోర్స్ అరతి జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు చేశారు. నకిలీ గుడ్ నైట్ మస్కిటో లిక్విడ్, ఏరియల్, టైడ్ డిటర్జెంట్ పౌడర్ ప్యాకెట్లను పలు దుకాణాలలో గుర్తించారు. రూ.1.41 లక్షల విలువైన నకిలీ ఉత్పత్తులను సీజ్ చేశారు. గుంతకల్లులో గుడ్‌నైట్ లిక్విడ్ డూప్లికేట్ ఉత్పత్తులను విక్రయిస్తున్నారని గొద్రెజ్ కంపెనీ నిర్వాహకులు తమకు ఫిర్యాదు చేశారని విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఐదు జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు చేశామని, రూ.97,675 విలువ చేసే నకిలీ గుడ్‌నైట్ లిక్విడ్‌కు సంబంధించిన 926 బాక్సులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నకిలీ సరుకు ఈ దుకాణాలకు ఎక్కడి నుంచి సరఫరా అయ్యిందో విచారిస్తున్నామని తెలిపారు. దాడుల్లో డిప్యూటీ ఎస్పీ నాగభూషణం, సీఐలు శ్రీనివాస్, జమాల్ బాషా, ఏవో వాసుప్రకాష్, ఏఈఈ రవీంద్రనాథ్, డీసీటీఓ సురేష్, గుంతకల్లు తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్, విజిలెన్స్ ఎస్ఐ వెంకటప్రసాద్, డిప్యూటీ ఏసీ హుస్సేన్ పీరా, తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్లు శంకర్, ఖాజాహుస్సేన్, జీఎస్టీ శాఖ శాఖ నుంచి విజయలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయిని రాష్ట్రానికి పరిచయం చేసింది వైసీపీనే

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్, గంజాయిని పరిచయం చేసిన పార్టీ వైసీపీ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విమర్శించారు. పెనుకొండలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో గంజాయి విరివిగా ఉండేదని, ప్రస్తుతం తమ ప్రభుత్వం దాన్ని నామరూపాలులేకుండా చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంత్రి నారాలోకేశ్ తీసుకున్న చర్యలవల్ల గంజాయిని పూర్తిగా నిర్మూలించామన్నారు. డ్రగ్స్ వాడితే కుటుంబాలు ఏవిధంగా చిన్నాభిన్నం అవుతాయో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నరసింగప్ప, కమిషనర్ సతీష్‌కుమార్, తహసీల్దార్ సురేష్, ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులతో మంత్రి సవిత

భూసేకరణపై గ్రామ సభలు: కలెక్టర్


భూసేకరణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు చేపట్టిన భూ సేకరణలపై ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుపై సంబంధితాధికారులతో కలెక్టర్ గురువారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో పలు ప్రాంతల్లో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు భూసేకరణ చేయాలని అందుకు సంబంధించి ఆయా గ్రామాల్లో ప్రజల అభిప్రాయాలు సేకరించి, సమగ్ర నివేదికను సమర్పించాలన్నారు. సమావేశం లో రెవెన్యూ అధికారులు, నెట్ క్యాప్ అధికారులు, సోలాప్ పవర్‌పాయింట్ ప్రతినిధులున్నారు.

మత్తుపై కఠిన చర్యలు: డీఐజీ

అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను సాగు చేసినా, వినియోగించినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషీ హెచ్చరించారు. మత్తు పదార్థాల నియంత్రణ విషయంలో రాజీ పడబోమని, జిల్లా నుంచి బహిష్కరిస్తామని అన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల విచక్షణ కోల్పోయి, నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందని అన్నారు. కుటుంబాలు దెబ్బతింటాయని, పిల్లలు భవిష్యత్తు కోల్పోతారని హెచ్చరించారు. మత్తు పదార్థాల నియంత్రణకు ఈగల్ టీమ్స్, ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు నిరంతరం పనిచేస్తున్నాయని అన్నారు. పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

జాతీయ కబడ్డీ పోటీలకు ఇద్దరి ఎంపిక


హిమజ, సజీద

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జాతీయ కబడ్డీ పోటీలకు ఇద్దరు జిల్లా క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఈనెల 28 నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-18 జాతీయ బాలికల కబడ్డీ పోటీలకు ఏపీ రాష్ట్ర జట్టు తరపున జిల్లా క్రీడాకారిణులు సజీద, హిమజ పాల్గొన నున్నారు. ఎంపికైన క్రీడాకారులను అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, విద్యుత్తుశాఖ విజిలెన్స్ సీఐ విశ్వనాథ్‌చౌదరి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ లక్ష్మణ్, సీనియర్ క్రీడాకారులు శ్యాంకుమార్, రాఘవేంద్ర, శాప్ కోచ్‌లు అనిల్‌కుమార్, సంధ్యలు జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులను అభినందించారు.

ఉద్యాన పథకాలను వాడుకోండి

● డీడీలు ఉమాదేవి, చంద్రశేఖర్

అనంతపురం అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి, శ్రీసత్యసాయి జిల్లా డీడీ చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మామిడి, జామ, చీనీ, దానిమ్మ, సీతాఫలం, సపోటా, రేగు, అరటి, బొప్పాయి, ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, అంజూర, ప్యాషన్ ఫ్రూట్, ఉసిరి, నేరేడు, చింత, పల్సా ఫ్రూట్, విడి పూల సాగు, హైబ్రీడ్ కూరగాయలు, పుట్టగొడుగుల పెంపకానికి ప్రభుత్వ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. పాతతోటల పునరుద్ధరణ, రక్షిత సేద్యంలో భాగంగా పాలి హౌస్, షేడ్‌నెట్, కవర్స్, ప్లాస్టిక్ మల్చింగ్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పంట కోత అనంతరం చర్యల యాజమాన్యంలో భాగంగా ప్యాక్ హౌస్, యూనిట్ ప్రాసెసింగ్, కోల్డ్ రూమ్ తదితర వాటిని మంజూరు చేస్తామన్నారు. ఉద్యాన యంత్రీకర ణలో భాగంగా మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్, తైవాన్ స్ప్రేయర్లను అందజేస్తామన్నారు. స్థానిక ఉద్యాన శాఖ కార్యాలయాలు, రైతు సేవా కేంద్రాల్లోని అధికారులు, సిబ్బందిని సంప్రదించి, ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన పథకాల కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రేపు మెగా జాబ్‌మేళా

రాయదుర్గంరూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన నిరుద్యోగులకు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు కళాశాలకు వస్తున్నారని జిల్లాకు చెందిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని వారు తెలిపారు. 9182920381 నంబర్‌కు కాల్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు.

పీఎస్ఓలకు శిక్షణ ప్రారంభం

అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్‌లకు (గన్‌మెన్) ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తామని ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా తెలిపారు. డీటీసీలో శిక్షణా తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. పీఎస్ఓలకు ఫిట్‌నెస్, ముందు జాగ్రత్తలు, ఆయుధ వినియోగం, ఫైరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్ కుమార్, ఆర్ఎస్ఐలు జాఫర్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మీదుగా బెంగళూరు-గ్వాలియర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్

గుంతకల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బెంగళూరు-గ్వాలియర్ మధ్య (వయా అనంతపురం) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును శాశ్వత ప్రాతిపదికన ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బెంగళూరు-గ్వాలియర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (11085) రైలు ఈ నెల 29 నుంచి ప్రతి ఆదివారం బెంగళూరులో మధ్యాహ్నం 3-50 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. ఈ రైలు మంగళవారం ఉదయం 10-25 గంటలకు గ్వాలియర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (11086) జూలై 4 నుంచి ప్రతి శుక్రవారం నడుస్తుందన్నారు. ఈ రైలు గ్వాలియర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 7-35 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజాపేట్, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగపూర్, బేతుల్, భోపాల్, విదిషా, బీనా, అశోక్‌నగర్, గుణ, శివపురి స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. ఈ రైల్లో 2 ఏసీ టూటైర్, 4 ఏసీ త్రీటైర్, 3 ఏసీ త్రీటైర్ ఎకానమీ, 7 స్లీపర్ క్లాస్, 4 జనరల్ సెకెండ్ క్లాస్, ఒక సెకెండ్ క్లాస్ లగేజ్ కం డిసేబుల్డ్ ఫ్రెండ్లీ కంపార్టుమెంట్, ఒక లగేజ్ కం జనరేటర్ కం బ్రేక్ వ్యాన్ కోచ్ ఉంటాయన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయండి : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా మినరల్ ఫండ్స్ కింద చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా మినరల్ ఫండ్స్‌కు సంబంధిం చిన మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ డిస్ట్రిక్ మినరల్ ఫండ్స్‌కు సంబంధించి 2024-25లో 116 పనులను గుర్తించామన్నారు. ఇందుకోసం రూ.11.72కోట్లు మంజూరైన ట్లు తెలిపారు. ఇప్పటివరకు 10 పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రూ.4కోట్లతో 27 పనుల కోసం ప్రతిపాదనలు వచ్చాయని, చెక్‌లిస్ట్ ప్రకారం పనులకు సంబంధించిన నివేదికలను ఆయా శాఖ అధికారులు అందజేయాల న్నారు. ఇతర ప్రాధాన్యతల కింద 61 పనులకు రూ.65కోట్లతో ప్రతిపాద నలు వచ్చినట్లు పేర్కొన్నారు. మినరల్ ఫండ్స్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రతి రూపాయి ఖర్చుని పరిశీలిస్తుందన్నారు. మంజూరైనా ఇంకా మొదలు పెట్టని పనులను క్షేత్రస్థాయిలో ఆయా శాఖల అధికారులు తనిఖీ చేయాలన్నారు. వారం రోజుల్లో తనిఖీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మైన్స్ ఏజీ ఆదినారాయణ, డీపీఓ నాగరాజునాయుడు, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, డీవీఈఓ వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

బంకించంద్ర ఛటర్జీ (జయంతి)



బెంగాలీ సాహిత్య సామ్రాట్‌గా పేరొందిన వందేమాతరం గేయ రచయిత, స్వరకర్త బంకించంద్ర ఛటర్జీ 1838 జూన్ 27న పశ్చిమబెంగాల్ రాష్ట్రం నైహతిలో జన్మించారు. బంకించంద్ర ఛటోపాధ్యాయగాను పిలుస్తారు. రచయిత, కవి, నవలా రచయిత, వ్యాసకర్త, పాత్రికేయుడిగా రాణించారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర సాహిత్యంలో తనదైన గుర్తింపు పొందారు. ఆయన రచించిన 'ఆనంద్ మఠ్' అనే నవలనుంచి వందేమాతరం గీతాన్ని సంగ్రహించారు. ఈ గీతం స్వాతంత్ర్య సంగ్రామంలో సమరశంఖంలా పనిచేసింది. రావ్‌బహద్దూర్ బిరుదు పొందారు. ఆయన స్వాతంత్ర్యోద్యమంలోనూ పాల్గొన్నారు. 1894 ఏప్రిల్ 8న కన్నుమూశారు.

హెలెన్‌కెల్లెర్ (జయంతి)



అంధులకు, బధిరులకు, మూగవారికి వారధిగా నిలిచిన హెలెన్ అడమ్స్ కెల్లెర్ 1880 జూన్ 27న యునైటెడ్ స్టేట్స్ అలాబామా ప్రాంతం టస్కంబియాలో జన్మించారు. అమెరికా దేశ రచయిత్రి. చిన్నవయసులోనే కంటిచూపు కోల్పోయినా మనోధైర్యంతో ముందుకు సాగారు. దివ్యాంగుల ఉద్యమాల సారథిగా ప్రపంచ స్థాయిలో పేరొంది ఎందరికో స్ఫూర్తినిచ్చారు. రాజకీయంగా కంటే అధ్యాపకురాలిగా తనదైన గుర్తింపు పొందారు. బ్రెయిలీ లిపిని మూడేళ్లలో ఔపోసన పట్టి హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి బీఏలో పట్టా పొందిన తొలి డెఫ్ బ్లైండ్ వ్యక్తి. అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్ సంస్థ ద్వారా అంధుల సంక్షేమానికి పాటుపడ్డారు. ప్రత్యేకించి మహిళల ఆరోగ్యం, కంటిచూపు, పౌష్టికతకోసం పనిచేశారు. ది ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం వంటి ఉన్నత ఉన్నత గౌరవాలు అందుకున్నారు. 1968 జూన్ 1న కన్నుమూశారు.

ఆర్‌డీ బర్మన్ (జయంతి)



సంగీతదర్శక దిగ్గజాలలో ఒకరైన రాహుల్ దేవ్ (ఆర్‌డీ) బర్మన్ 1939 జూన్ 27న కోల్కత్తాలో జన్మించారు. 1960-90ల మధ్య దేశ సినీరంగంలో తనదైన ముద్రను చాటారు. 331సినిమాలకు సంగీతాన్ని అందించారు. పాశ్చాత్య, లాటిన్, ఓరియంటల్, అరబిక్ శైలిల ప్రభావం ఆయన సంగీతంలో కనిపిస్తుంది. ఆయన సంగీత దర్శకత్వంలో ఆశాభోస్లే, కిశోర్‌కుమార్, లతా మంగేష్కర్ వంటి వారు ఎక్కువగా పాటలు పాడారు. 3 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. 1994 జనవరి 4న కన్నుమూశారు.

పీటీ ఉష (పుట్టినరోజు)



పరుగుల రాణిగా పేరొందిన 'పద్మశ్రీ' గ్రహీత, పిలావుళ్లకండి తెక్కె పరంబల్ (పీటీ) ఉష 1964 జూన్ 27న కేరళ రాష్ట్రం కోజికోడ్ జిల్లా పయోలీలో జన్మించారు. క్వీన్ ఇండియన్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌గా పేరొందారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరుగులో సత్తా చాటుకున్నారు. 2019లో మూడు యూనివర్సిటీలు ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశాయి. అర్జున అవార్డు, వరల్డ్ ట్రోఫీ అవార్డు ఇతరత్రా పురస్కారాలు అందుకున్నారు. 13 బంగారు పతకాలు, ఇతర రివార్డులు సాధించారు. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా ఉన్నారు. కాగా రాజ్యసభకు నామినేట్ అయిన ఆమె వైస్‌చైర్ పర్సన్స్ కమిటీలో సభ్యురాలిగా ఉన్నారు. దీంతో రాజ్యసభ చైర్మన్, డిప్యూటీ చైర్మన్‌లు లేని సమయంలో సభాపతిగా వ్యవహరించారు. ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్‌కు సలహాదారురాలిగా ఉన్నారు.



దొడ్డబళ్లాపురలో ఆందోళన చేపట్టిన వామపక్ష నాయకులు



బాగేపల్లిలో పోరాట సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో...

అన్నదాతల అరెస్ట్‌పై ఆగ్రహం

దొడ్డబళ్లాపుర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేఐఏడీబీ చేపట్టిన భూస్వాధీనాన్ని వ్యతిరేకిస్తూ దేవనహళ్ళిలో చేపట్టిన ధర్నాలో పాల్గొన్న రైతులను అరెస్టు చేయడాన్ని వామపక్షాలు ఇతర పార్టీలు తీవ్రంగా ఖండించాయి. సీపీఎం, సీఐటీయూ, కేఎఆర్ఎస్, దళిత, ప్రగతిపర, కన్నడ పోరాట సంఘాలు గురువారం నిరసనలో పాల్గొన్నాయి. నిజంగా రాష్ట్రప్రభుత్వానికి అన్నదాతలపై చిత్తశుద్ధి ఉంటే రైతులను వేధించడం సరికాదని, వెంటనే రైతులపై బనాయించిన కేసులను వాపసు తీసుకోవాలని, కేఐఏడీబీ చేపట్టిన భూస్వాధీన ప్రక్రియను ఆపాలన్నారు. రైతులకు అండగా నిలవాలని రైతుసంఘం నాయకుడు చంద్రతేజస్వి, ముత్తేగౌడ డిమాండ్ చేశారు. నిరసన కేఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, కరవే (కన్నడిగుల వర్గం) చంద్రశేఖర్, కరవే శివరామేగౌడ వర్గం హమామ్ వెంకటేశ్ పాల్గొన్నారు.

బాగేపల్లి : దేవనహళ్ళి తాలూకా చన్నరాయపట్టణ హోబళిలో భూస్వాధీనాన్ని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ఆందోళన చేపట్టిన వారిని అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ వివిధ పోరాటసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ జీవీ శ్రీరామెడ్డి విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. కూలికార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంపీ మునివెంకటప్ప మాట్లాడుతూ బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహళ్ళి తాలూకా, చన్నరాయపట్టణ హోబళి పరిధిలో 13 గ్రామాలలో 1,777 ఎకరాల సారవంతమైన భూమిని కేఐఏడీబీ బలవంతంగా స్వాధీనం చేసుకోవడానికి సిద్ధం కావడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. చలో దేవనహళ్ళిలో పాల్గొన్న రైతులు, దళితులు, కార్మికులు, మహిళలు, యువత పాల్గొనగా సాయంత్రం 5 గంటల తర్వాత ప్రతిఘటనకు అవకాశం లేదంటూ వారిని అరెస్టు చేశారన్నారు. రైతులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. నిరసనలో డీటీ మునిస్వామి, నాగరాజు, అశ్వత్థప్ప, జీ కృష్ణప్ప, గోవిందరెడ్డి, రామాంజి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సంగీతంతో మానసికోల్లాసం

● సంగీత దర్శకుడు శంకర్ మహదేవన్



విద్యార్థులతో శంకర్‌మహదేవన్

బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సంగీతం ద్వారా మానసికోల్లాసం సాధ్యమని ప్రముఖ సంగీత దర్శకుడు శంకర్ మహదేవన్ అభిప్రాయపడ్డారు. సంగీతానికి పిల్లలు పెద్దలు అందరూ మైమరచిపోతారన్నారు. బుధవారం శంకర్ మహదేవన్ అకాడమీ 15వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగాయి. 2011లో అకాడమీ ప్రారంభం కాగా ఇంతవరకు 50వేలమందికిపైగా తర్ఫీదు పొందగా 5లక్షలకుపైగా లైవ్ ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. మన లక్ష్యం స్పష్టంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలమని, టొరంటోలోని 65ఏళ్ల అవ్వ బెంగళూరులోని తమ 7ఏళ్ల మనవరాలితో కలసి సంగీతం నేర్చుకోవడం చూసి ఎంతో సంతోషం కలిగిందన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫాంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్సులు పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు.

పార్టీ బలోపేతం కోసమే రాష్ట్ర పర్యటన

● యువ జనతాదళ్(ఎస్) అధ్యక్షుడు నిఖిల్ కుమార స్వామి



మాట్లాడుతున్న నిఖిల్ కుమారస్వామి

రాయచూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జనంతో జనతాదళ్ పేరుతో చేపట్టిన రాష్ట్ర పర్యటన పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యమని జనతాదళ్(ఎస్) యువ రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్ కుమార స్వామి అన్నారు. తాను చేపట్టిన రాష్ట్ర పర్యటనలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని, ఎన్నికల కోసం కాదని స్పష్టం చేశారు. గురువారం జిల్లాలోని సింధనూరు నగరంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడం ద్వారా కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తామన్నారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● జాబ్‌మేళాలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూన్26(ఆంధ్రజ్యోతి): యువత వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించడంతో స్వశక్తిగా ఎదిగేందుకు సహకారం అందించడంతోపాటు పరిశ్రమలకు సీఎం చంద్రబాబునాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి పాల్గొన్నారు. 20కంపెనీలు పాల్గొనగా అందులో 105మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని, కొంత మంది ఉన్నత విద్యను అభ్యసించి గ్రామాల్లోనే ఉండిపోతున్నారన్నారు. అలాంటి వారికి ఇలాంటి ఉద్యోగ మేళాలు వరంగా మారుతున్నాయన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు దూరమయ్యారని అన్నారు. సీఎం చంద్రబాబు బాధ్యతలు స్వీకరించాక రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయన్నారు.

మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై జాగృతి



జాగృతిలో పాల్గొన్న విద్యార్థులు

చేళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మత్తు కలిగించే మాదకద్రవ్యాల పదార్థాల జోలికి వెళ్లరాదని, మత్తుకు బానిస కావద్దని అధికారులు పేర్కొన్నారు. వరల్డ్ డ్రగ్ అబ్యూస్ డేలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, అరవింద్, భారతి, ప్రశాంతి, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు గురువారం పురవీధులలో ర్యాలీలో పాల్గొన్నారు. గుట్కా, బీడీ, సిగరెట్, పాన్ ఇతర వాటి వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఆరోగ్యంతోపాటు ఆర్థికభారం కలిగించే మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని ఉపాధ్యాయులు సూచించారు.

ఐదు పులుల అనుమానాస్పద మృతిపై

విచారణకు మంత్రి ఆదేశం

బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): చామరాజనగర్ జిల్లా మలెమహదేశ్వర కొండకు అనుబంధంగా ఉండే అటవీ ప్రాంతంలో ఇటీవల ఒక పెద్దపులితో పాటు నాలుగు పిల్లలు మృతి చెందిన సంఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. పులుల అసహజ మృతికి గల కారణాలను తెలుసుకునేలా సమగ్ర దర్యాప్తు జరపాలని అటవీశాఖా మంత్రి ఈశ్వర్‌ఖండ్రే ఆదేశించారు. గురువారం బెంగళూరులో మంత్రి మీడియాతో మాట్లాడుతూ పులుల మృతిని సీరియస్‌గా భావించామని అటవీశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిని ఆదేశించామన్నారు.

నోరూరిస్తున్న తెలుగు పచ్చళ్లు



బాటిళ్లలో పచ్చళ్లు నింపుతున్న నాగమణి

కంప్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రవాసాంధ్రురాలైన నాగమణి తయారు చేస్తున్న పచ్చళ్లు స్థానికంగా ప్రజాదరణ పొందుతున్నాయి. కంప్లి తాలూకా సన్నపురం గ్రామపంచాయతీ బసవేశ్వరక్యాంప్‌లో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నాగమణి నోరూరించే పచ్చళ్లు తయారు చేస్తున్నారు. మామిడి, టమోటా, మునగ, మిర్చి, వంకాయ, అల్లం, క్యారెట్, కాకరకాయ, బీట్‌రూట్, కాలీఫ్లవర్, గోంగూర తదితర రకాలతోపాటు చికెన్, మటన్, ఫిష్, ప్రాన్స్‌తో పచ్చళ్లు చేస్తున్నారు. రెండేళ్లక్రితం ఆమె పచ్చళ్ల తయారీని ప్రారంభించారు. ఆమె భర్త వ్యవసాయం చేస్తున్నారు. పలుమార్లు పంటలు పెట్టి నష్టపోవడంతో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పచ్చళ్ల తయారీ వ్యాపారం ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఇక్కడి నుంచి ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు కూడా పంపిస్తున్నట్లు తెలిపారు. పచ్చళ్ల విక్రయాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నట్లు తెలిపారు. రానున్నరోజుల్లో మార్కెట్‌లో మంచి అవకాశాలు లభిస్తాయనే ఆశ ఉందన్నారు.

నేడు కెంపేగౌడ జయంతి

పావగడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కెంపేగౌడ జయంతిని పట్టణంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కుంచటిగా ఒక్కళిగ ఐక్యత సంఘం తాలూకా అధ్యక్షుడు తిప్ప వీరన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎస్ఎస్‌కే సముదాయ భవనాలు జరిగే కార్యక్రమంలో నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా నంజావధూత స్వామి, హనుమంతానంద స్వామి, ప్రముఖ కన్నడ చలనచిత్ర హాస్యనటుడు రంగయణ రఘు, ఎమ్మెల్యే వెంకటేశ్ పాల్గొంటారని, జయప్రదం చేయాలని కోరారు.

కేఎంఎఫ్ అధ్యక్ష రేసులో ఉన్నా

● మాజీ అధ్యక్షుడు ఎల్‌బీపీ భీమానాయక్



బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన కేఎంఎఫ్ అధ్యక్ష స్థానాన్ని దక్కించుకోవడం కోసం మాజీ ఎంపీ డీకే సురేశ్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందుకు అన్న, డీసీఎం డీకే శివకుమార్ సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా బమూల్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ తరుణంలో తానుసైతం కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) అధ్యక్షస్థానం రేసులో ఉన్నానని మాజీ అధ్యక్షుడు ఎల్‌బీపీ భీమానాయక్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయచూరు, బళ్ళారి, కొప్పళ, విజయనగర్ (రాబకొవి) పాల సమాఖ్య ఎన్నికల్లో డైరెక్టర్‌గా పోటీచేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికలకు విధించిన స్టేను ధారవాడ హైకోర్టు బెంచ్ తొలగించడంతో జులై 10న ఎన్నికలు జరుగనున్నాయన్నారు. బళ్ళారి నుంచి తాను కేఎంఎఫ్ అధ్యక్షస్థానం ఆశిస్తున్నవారిలో ఒకడినన్నారు. అయితే దీనిపై అంతిమంగా పార్టీ నాయకులు అంతిమంగా తీర్మానిస్తారన్నారు. తద్వారా డీకే సురేశ్‌కు పోటీ ఇస్తున్నట్టు పరోక్షంగా తెలిపారు.

అనుమానాస్పద మృతి..!



శ్రేయస్ (ఫైల్)

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సోలదేవనహళ్ళిలో ఆచార్య కాలేజ్‌లో సహాయక ప్రాధ్యాపకులుగా ఉన్న శ్రేయస్ (33) మృతదేహం కెరెగుడ్డదహళ్ళి ఇంట్లో బుధవారం లభించింది. శ్రేయస్ పశ్చిమబెంగాల్‌కు చెందిన వ్యక్తి. రిటైర్డు ఐఏఎస్ అధికారి శశాంక్ కుమారుడు. ఆచార్య కళాశాలలో సైకాలజీ విభాగంలో సహాయక ప్రాధ్యాపకులుగా శ్రేయస్ కొనసాగుతున్నారు. మూడు రోజుల నుంచి ఇంటి వాకిలి తీయలేదనే సమాచారంతో పోలీసులు చేరుకుని పరిశీలనలు జరపగా మృతదేహం లభించింది. గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా పోస్టుమార్టం నివేదిక అనంతరం మరిన్ని వాస్తవాలు తెలుస్తాయన్నారు.

మాయదారి మందులు..!

బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఆరోగ్యశాఖ ప్రకటించిన సురక్షితం కాని ఔషధాల జాబితాలో ఒక సంస్థ తయారు చేసే ప్యారాసిటమాల్ మాత్ర కూడా ఉండడం గమనార్హం. సాధారణంగా జ్వరం, దగ్గు, జలుబు ఏ ఇతర చిన్న అనారోగ్యమైనా ప్యారాసిటమాల్ మాత్రలు వాడుతారు. చిన్నారుల నుంచి పెద్దల దాకా వివిధ ఎంజీల డోసులలో ప్యారాసిటమాల్ మాత్ర వాడడం సామాన్యం. అటువంటిది సురక్షితం కాని ఔషధాల జాబితాలో ప్యారాసిటమాల్ ఉండడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆరోగ్యశాఖ మే నెలలో వివిధ ఔషధాల నమూనాలను సేకరించింది. మైసూరు కంపెనీ ఓ శాంతిగోల్డ్ కుంకుమ్ సహా 15 బ్రైటనింగ్ డ్రగ్స్ నమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు. ఇలా వీటికి సంబంధించిన ఫలితాల నివేదికను బుధవారం ప్రకటించారు.

సురక్షితం కాని ఔషధాలు

అల్ట్రా ల్యాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ - కంపౌండ్ సోడియం ల్యాక్టేట్ ఇంజెక్షన్ ఐపీ, మేటామ్‌బ్రాన్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ - కంపౌండ్ సోడియం ల్యాక్టేట్ ఇంజెక్షన్ ఐపీ, అబాన్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ - పోమెల్ 650 (ప్యారాసిటమాల్ ట్యాబ్లెట్స్ 650 ఎంజీ), బయోన్ థరాప్యాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ - మిటు క్యూ 7 సిరప్, సేఫ్ పేరెంటల్ ప్రైవేట్ లిమిటెడ్ - స్పైరల్ డిల్యెయంట్ పార్ రెకానోస్టిటిశ్యూన్ అప్ ఎన్‌డి, ఐబి, ఐబిడి అయండ్ కాంబినేషన్ వ్యాక్సిన్ ఫార్ పౌల్ట్రీ (వెటర్నరీ) మల్టీ డోస్ విలా 200ఎంఎల్, ఇండోరామ్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, ఇండోరామ్‌హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ - స్పాన్‌ప్లాక్స్ ఓడ్ ట్యాబ్లెట్స్ (ఓఫ్లాక్సిన్ అండ్ ఓర్నిడజోల్ ట్యాబ్లెట్స్ ఐపీ) తదితర సంస్థల ఔషధాలు ఉన్నాయి. పైనే పేర్కొన్న ఔషధాలు నిల్వ చేయడం, విక్రయించడం లేదా ఉపయోగించడాన్ని నిషేధిస్తున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

30న మ్యూచువల్ పెట్టుబడులపై

ప్రత్యేక వెబినార్

బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మ్యూచువల్ ఫండ్‌లలో పెట్టుబడుల విషయంలో సమగ్ర అవగాహన కల్పించే దిశగా ఎస్‌బీఐ మ్యూచువల్‌ఫండ్ ఉపాధ్యక్షులు సుష్మిరా అబిది ప్రత్యేక వెబినార్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు ఫ్రం డ్రీమ్స్ టు డాలర్స్ అనే శీర్షికన వెబినార్ ఉంటుందని నిర్వాహకులు గురువారం బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. 30న సాయంత్రం 4.30గంటలకు వెబినార్‌ను వెల్త్ బాక్స్ సంస్థ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఆర్థికంగా పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకునేందుకు వేదిక కానుందన్నారు. వ్యక్తిగతంగా సంపాదనను పెట్టుబడుల వైపు వెళ్ళేందుకు ముందుగానే ప్రాథమిక అంశాలపై అవగాహన పెంచుకునే దిశగా వెబినార్‌లో వివరిస్తారన్నారు.



గుంతకల్లులో రాయచూరు వాసి ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని రైల్వేస్టేషన్ పార్శిల్ కార్యాలయం ఎదురుగా రాయచూరు జిల్లా లింగసూగూరుకు చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు సమీపంలోని పార్కులో ఓ చెట్టుకు శరణప్ప(39)అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను బేల్దారి పనిచేసుకుని జీవనం సాగించేవాడు. మూడు రోజుల క్రితం తిరుపతికి వెళ్తునట్లు ఇంట్లో చెప్పి బయల్దేరాడు. అయితే గురువారం ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య శ్రీదేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతికి గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కసాపా గౌరవ కార్యదర్శి హోదాకు

నేభ రామలింగశెట్టి రాజీనామా



బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్య పరిషత్ గౌరవ కార్యదర్శి పదవికి నేభ రామలింగ శెట్టి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మూడేళ్ళకాలంగా ఆయన గౌరవకార్యదర్శి హోదాలో కొనసాగారు. పరిషత్ అధ్యక్షులు నాడోజ మహేష్ జోషితో విభేధాల కారణంగానే రాజీనామా చేసినట్లు గురువారం ప్రకటించారు. ఇందుకు సంబంధించి సుదీర్ఘమైన లేఖను విడుదల చేశారు. వ్యక్తిగతంగా కన్నడ సాహిత్య పరిషత్ పట్ల ఉన్న సాహిత్యాభిమానంతోనే పదవిలో కొనసాగినట్లు పేర్కొన్నారు. కన్నడ భాష, సాహిత్యంతో తన జీవితం ముడిపడి ఉందని ఎంతోమంది సాహితీ దిగ్గజాలు తన పట్ల అభిమానం చూపారని రాసుకున్నారు. వ్యక్తిగతంగా 15 పుస్తకాలను రాసిన విషయాన్ని పొందుపరచారు. కర్ణాటక రక్షణ వేదిక ద్వారా సాహిత్య రంగంలోకి వచ్చి సేవలు చేశాననే సంతృప్తి ఉందని అధ్యక్షుడి వేధింపులు తట్టుకోలేక పోయానన్నారు.

కాంట్రాక్టర్ హత్య వెనక మరో కోణం..!

● రాసలీలల ఫొటోలు, వీడియోలు బయట పడతాయనే..

బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సుపారీ ఇచ్చిన కాంట్రాక్టర్ హత్యకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. ఈనెల 24న హావేరి జిల్లా శిగ్గాంవిలో కాంట్రాక్టర్ శివానంద కున్నూరు హత్య జరిగింది. దారుణం వెనుక భారీగా విలువ చేసే స్థలవివాదం ఉందనే అందరూ భావించారు. అయితే హత్యకు కారకుడైన అశ్రఫ్ మాట్లాడిన ఆడియోలు కొత్తకోణానికి దారి తీసాయి. శివానందకు చెందిన అశ్లీల ఫొటోలు, వీడియోలు అశ్రఫ్ దగ్గర ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదమేనని శివానంద సుపారీ ఇచ్చినట్లు అశ్రఫ్ ఆరోపిస్తున్నారు. హత్య తర్వాత పరారీ అయిన అశ్రఫ్ సన్నిహితుల వద్ద మాట్లాడిన ఆడియోలు వైరల్ అయ్యాయి. ఇందులో తనతో పాటు నాగరాజ్ సవదత్తిలను హతమార్చేందుకు హుబ్బళ్ళికు చెందిన కొందరికి సుపారీ ఇచ్చారని అశ్రఫ్ ఆరోపించారు. హుబ్బళ్ళికి చెందిన యువకులు కొందరు కిడ్నాప్ చేశారని బట్టలు లేకుండా చేశారని వారి నుంచి తప్పించుకుని వచ్చినట్లు ఆడియోలో స్పష్టం చేశారు. శిగ్గావి పట్టణ శివారులోని ఓ హోటల్ నుంచి సుపారీ కిల్లర్స్‌తో పాటు చర్చలు జరిపిన శివానంద వారికి కవర్‌లలో డబ్బులు ఇచ్చినట్లు వారు బయటకు వచ్చినట్లుగా సీసీ ఫుటేజీలు లభించాయి. కాగా శివానంద హత్యకు నాగరాజు కారకుడనే అనుమానంతో అతడి ఇంటికి పెట్రోలు పోసి నిప్పంటించారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు అయ్యింది. అయితే అశ్రఫ్ వద్ద ఉండే శివానంద అశ్లీల వీడియోలు ఎవరికి చెందినవనేది మరో ట్విస్టుగా మారింది. గురువారం అశ్రఫ్, నాగరాజులను అరెస్టు చేసేందుకు వెళ్ళగా తప్పించుకునే ప్రయత్నం చేయగా ఇద్దరిపైనా కాల్పులు జరిపిన శిగ్గాంవి పోలీసులు అరెస్టు చేశారు. వారిని హుబ్బళి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.


రాజకీయాల కోసం బలి చేయకండి

● బలిజ సంఘాల నాయకుల ఆందోళన

బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాజకీయాల కోసం కొందరు ప్రభావిత వ్యక్తులు బలిజ సమాజానికి చెందిన పట్టభద్రులను సభ్యులుగా చేర్చడాన్ని తప్పుబట్టారు. ఇలాంటి మోసాలకు తావివ్వరాదని నిస్వార్థ బలిజ యువకుల పేరుతో ఆందోళన చేశారు. ఈనెల 24 నుంచి చామరాజపేట స్త్రీ సమాజ భవన్‌లో ఆందోళన చేస్తున్నట్లు ప్రకటించారు. బలిజ సంఘం పేరుతో కొందరు సభ్యులను చేస్తున్నారని సభ్యత్వం రుసుము వారే కొట్టుకుంటున్నట్లు ఆరోపించారు. బలిజల ఆత్మగౌరవాన్ని కొనుగోలు చేసే ప్రయత్నాలు సమంజసం కాదన్నారు. బలిజ సంఘం పధాధికారులు, ముఖ్యులు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మేయర్ పద్మావతితో పాటు పలువురు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బలిజ వర్గీయులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1616.27	1581.29
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	30,838	604
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	198	1,995
నీటి నిల్వ (టీఎంసీలు)	52.94	5.13

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బ్యాంక్ అధికారులు

బళ్లారి సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బళ్లారి జిల్లా బ్రాంచ్, బీఐఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం 70వ ఎస్‌బీఐ వార్షికోత్సవం సందర్భంగా మెయిన్ బ్రాంచ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ జనరల్ మేనేజర్ అలోక్ చంద్ర రక్తదానం చేసి మాట్లాడారు. ఎస్‌బీఐ 70వ వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అందరూ రక్తదానం చేసి ప్రాణదాలు కండని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్నవారికి ఈ రక్తం ఎంతో ఉపయోగపడి వారి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఎస్‌బీఐ మెయిల్ బ్రాంచ్ ఏజీఎం రవి మేషరాం, శ్రీరాము, గౌతమ్, మధుకేశ్వరస్వామి, ప్రేమ్‌సింగ్‌నాయక్, వాదిరాజు, సూరజ్, రామకృష్ణ దేవర, ధర్మేంద్ర నాగపాల్, మహేశ్వరప్ప రక్తదానం చేశారు.

నగరసభ కమిషనర్‌గా గంగాధర్



కమిషనర్‌ను సన్మానిస్తున్న నగరసభ అధ్యక్షుడు, సిబ్బంది

సిరుగుప్ప, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప నగర సభ కమిషనర్‌గా గంగాధర్ పదవీబాధ్యతలు చేపట్టా రు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ గురుప్రసాద్ ఇతర ప్రాంతానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం గంగాధర్ నియమించారు. నగర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిం చి అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. నగరసభ అ ధ్యక్షురాలు రేణుకమ్మ, వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లు కరిబసప్ప, కౌన్సిలర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పీడీ హళ్లిలో శాంతిసభ



మాట్లాడుతున్న సీఐ రుద్రప్ప

బళ్లారి రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమదేవనహళ్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొహరం పండుగ సందర్భంగా శాంతిసభ నిర్వహించారు. సభకు పలు గ్రామాల ప్రముఖులు, యువకులు హాజరయ్యారు. సీఐ రుద్రప్ప మాట్లాడుతూ మొహరం పండుగ సందర్భంగా గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడకుండా శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు ఏవైనా వుంటే పోలీస్‌స్టేషన్ ఫోన్ నంబర్లకు ఫోన్‌చేసి తెలపాలన్నారు. ఎస్ఐ తిమ్మారెడ్డి, ఏఎస్ఐ దుర్గాప్రసాద్, సురేష్, ప్రభాకర్‌రెడ్డి, రెహమాన్, రవి, వన్నూరప్ప, నేత్రావతి, ప్రభావతి, వలి, మతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గిడ్డంగుల పరిశీలన

కంప్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): చిక్కజగనూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ గిడ్డంగులను జిల్లా అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా పరిశీలించారు. బుధవారం జిల్లాఅధికారులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడి గిడ్డంగిలో జొన్నలు సహా నాణ్యమైన తృణధాన్యాలను నిల్వ చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. జొన్నల నిల్వలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథ్ నాయక్, పౌర ఆహార సరఫరాల శాఖ అధికారి షకీనా బేగం, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ బ్రాంచ్ మేనేజర్ అంబరీశ్ పాల్గొన్నారు.



జొన్నల నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ శోభారాణి



మాట్లాడుతున్న అభినవ సిద్దేశ్వర స్వామీజీ

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎస్పీ

బళ్లారిరూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రజలు, విద్యార్థులు, యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ శోభారాణి సూచించారు. నగరంలో గురువారం డీఎస్పీ చంద్రకాంత్ నందరెడ్డి, సీఐ మంతేష్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై బళ్లారి ఎస్పీ ఆఫీసు నుంచి రాయల్ సర్కిల్, బెంగళూరు రోడ్డు, బ్రూస్‌పేట సర్కిల్ నుంచి బ్రూస్‌పేట పోలీస్‌స్టేషన్ వరకు పలు కాలేజీలు, స్కూలు విద్యార్థులు పోలీసు ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బళ్లారిరూరల్ పరిధిలోని మోకా పోలీస్ స్టేషన్, మోకా గ్రామంలో పీయూ కాలేజ్ ఆధ్వర్యంలో ఎస్ఐ కాళింగ మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు, గ్రామస్థులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు వ్యసనాల నుంచి విముక్తులు కావాలి

బళ్లారి సిటీ: ప్రజలు వ్యసనాల నుంచి విముక్తులు కావాలని అభినవ గవిసిద్దేశ్వర స్వామీజీ సూచించారు. గురువారం జిల్లాపోలీస్ శాఖ మున్సిపల్ కౌన్సిల్ సహకారంతో నిర్వహించిన అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవ వేడుకల్లో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చెడు అలవాట్లను మీ ప్రేమపూర్వక మాటలతో యాన్పించేయవచ్చాన్నారు. నటుడు అజయ్‌రావు మాట్లాడుతూ ఒక మొక్కగా లేకుండా చెట్టుగా ఉండలేదని, విద్యార్థి చెడు అలవాట్లకు దూరంగా ఉంటే జీవితంలో గణనీయమైన విజయాలు సాధించగలడన్నారు. నగర కౌన్సిల్ చైర్మన్ రూపేశ్ కుమార్, విద్యాశాఖ నాగరాజ హవల్దార్, జిల్లా ఆర్‌సీహెచ్ డాక్టర్ జంబయ్య, డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్ నారాయణరెడ్డి, ప్రకాశ్ షానుబాగ్, డీవైఎస్పీ మంజునాథ పాల్గొన్నారు.

సిరుగుప్ప: మత్తుపదార్థాలు సేవించడం ఆరోగ్యానికి హానికరమని వీకేజేజే కళాశాల ప్రిన్సిపాల్ శాంతనగౌడ అన్నారు. గురువారం స్థానిక వీకేజీ కళాశాల ఆవరణంలో తాలుకా పరిపాలన, పంచాయతీ, జిల్లా పరిషత్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పచ్చ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు.

వ్యసనాలతో కుటుంబాలకు ముప్పు

రాయచూరు: సరదాగా మొదలైయ్యే మాదక ద్రవ్యాల అలవాటు వ్యసనంగా మారి వ్యక్తినే కాకుండా కుటుంబాన్నే ర్వనాశనం చేస్తుందని జిల్లాధికారి నితీశ్ అన్నారు. గురువారం నగరంలోని పండిత్ సిద్ధరామ్ జంబలదిన్ని రంగమందిరంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో పొరుగు రాష్ట్రాల నుంచి మాదక ద్రవ్యాల రవాణా విక్రయం జరుగుతున్నట్లు ఇప్పటికే అధికారుల దృష్టికి రాగా నియంత్రణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణను అమలు చేసేందుకు పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.



సిరుగుప్పలో ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శాంతనగౌడ



రాయచూరులో జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నితీశ్

జమీర్‌ను మంత్రి పదవి నుంచి తొలగించండి

● బీజేపీ నాయకుల డిమాండ్

కంప్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఇళ్ల కేటాయింపులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి జమీర్‌అహ్మద్‌ను పదవినుంచి తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కంప్లి తాలూకా బీజేపీ అధ్యక్షుడు మహదేవ నేతృత్వంలో బుధవారం ఈఓ శ్రీకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్జల్‌పుర తాలూకాలో పేదలకు ఇచ్చే 200 రాజీవ్‌గాంధీ ఇళ్లకు మంత్రి జమీర్ అహ్మద్, ఆయన ఆప్తకార్యదర్శి అవినీతికి పాల్పడినట్లు ఆళంద నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఆరోపించారన్నారు. వెంటనే ముఖ్యమంత్రి స్పందించి మంత్రి జమీర్‌ను పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శులు సుగుణ, పట్టణ అధ్యక్షుడు మురళీమోహన్‌రెడ్డి, కార్యదర్శి కట్టి విశ్వనాథ్, శ్రీధర్‌శెట్టి, రియాజ్, బ్రహ్మయ్య సుధాకర్, ప్రశాంత్ బాలచంద్ర శ్రీనివాస్, దేవేంద్ర సన్న ఉలిగప్ప, వెంకటేశ్, పంపనగౌడ, రవి, విరూపాక్షి రమేశ్‌రాజు పాల్గొన్నారు.



ఈఓ శ్రీకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి

● కన్నడ సినీ నటుడు, నిర్మాత అజేయరావు



మాట్లాడుతున్న సినీ నటుడు అజేయరావు

హొస్పేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలని కన్నడ సినీ నటుడు, నిర్మాత అజేయరావు అన్నారు. నగరంలో తాను చదువుకున్న విజయనగర కళాశాలను సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాల రోజులను గుర్తుచేసుకున్నారు. విద్యార్థులు ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదని, అందరితో మంచి సంబంధాలు కొనసాగించాలన్నారు. అందరికీ మంచి చేయాలని, దయగా ఉండాలని, ఏమి జరిగినా యువతీ, యువకులుపట్ల దయగా ఉండాలని సూచించారు. నేను చదివిన కళాశాల నాకు చాలా మంచి విద్యను అందించడమే కాకుండా క్రమ శిక్షణను నేర్పిందన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో ఉన్నా విజయనగర కళాశాల విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తుండటం గర్వకారణమని ఆయన అన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలక మండలి అధ్యక్షుడు ఎన్ మల్లికార్జున, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుగౌడ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జునగౌడ్, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు వీఎస్ శ్రీపాద, ఉపాధ్యక్షులు కొరిశెట్ట లింగప్ప, గొగ్గచెన్నబసప్ప, ప్రధాన కార్యదర్శి ఒప్పతైప్ప, మహావీర్‌జైన్, కిరణ్ కుమార్, వీరభద్రస్వామి, సునీల్ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి: డీహెచ్‌ఓ

బళ్లారి సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని జిల్లా ఆరోగ్యకుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు అన్నారు. గురువారం ఆయన బళ్లారి తాలూకా కే.వీరాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి 5సంవత్సరాల వరకు పిల్లలకు విరేచనాల నియంత్రణ కార్యక్రమం కింద జింక్, ఓఆర్ఎస్ ద్రావణం గురించి అవగాహన పెంచడానికి పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యం నుంచి కౌమారదశ వరకు ఉన్న కాలం ఒక వ్యక్తి జీవితంలో చాలా ముఖ్యమైనదన్నారు. హార్మోన్ల మార్పులు బాలురు,బాలికలలో శారీరక మార్పులు జరుగుతాయన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయుల మార్గనిర్దేశం తీసుకొని భవిష్యత్తులో ఉన్నత పదవులు పొందాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. నేటి పోటీ కాలంలో శ్రద్ధగా చదువుకోవడంపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. యువకులు మొబైల్ ఫోన్‌లను ఉపయోగించి అపరిచితులతో సంబంధాలు ఏర్పర్చుకోవడం, వారి కుటుంబాలకు తెలియకుండా వివాహనం చేసుకోవడం తదితర ఘటనలు పత్రికల్లో వస్తున్నాయన్నారు. ఇది బాల్య వివాహాలకు కూడా దారితీస్తుందని, చాల సార్లు దుర్మార్గులచే లైంగిక దాడులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా బాలికల్లో రక్తహీనత కొనసాగితే కౌమారదశలో సమస్యలు, వైవాహిక జీవితంలో తీవ్ర సమస్యలుగా మారుతాయన్నారు. ఈ విషయంలో పిల్లలు సంవత్సరానికి రెండుసార్లు తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో షిడిగినమొళ ప్రాథమిక ఆర్గోగ్య కేంద్రం అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంతోషహెబ్బల్, జిల్లాఆరోగ్య విద్య అధికారి ఈశ్వర దాసప్ప, ప్రధానోపాధ్యాయుడు నాగరాజ్, సీనియర్ ప్రాథమిక ఆరోగ్య రక్షణ అధికారి శకుంతలమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మధులత, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు, పిల్లలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్ బాబు

ప్రజాస్వామ్య వ్యవస్థకు కాంగ్రెస్ అపచారం

● ఏబీవీపీ నగర అధ్యక్షుడు జగదీశ్



మాట్లాడుతున్న జగదీశ్

బళ్లారి సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని 50 సంవత్సరాల చీకటి చరిత్ర అత్యవసర పరిస్థితి అనే కార్యక్రమాన్ని నగరంలోని బీపీఎస్ స్కూల్లో గురువారం నిర్వహించినట్లు ఏబీవీపీ నగర అధ్యక్షుడు జగదీశ్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని విధించడమే కాకుండా, భారతీయుల గొంతును అణచివేయడానికి కూడా ప్రయత్నించారని అన్నారు. ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరా గాంధీ రాజ్యాంగం గొంతు కోసి, ప్రజల జీవన స్వేచ్ఛను హరించారన్నారు. కేఎస్ఎస్ ప్రావిన్షియల్ కో-చైర్మన్ ప్రసన్న మాట్లాడుతూ 1975 జూన్ 25న విధించింది అత్యవసర పరిస్థితి కాదని, అది పౌరసమాజానికి అన్ని స్వేచ్ఛలను హరించేదన్నారు. ఇది చూడటానికి సహజమైన విషయే అయినా దేశంలోని యువత తమ సొంత కీర్తి ఆత్మగౌరవం కోసం, పౌరసత్వ సారాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. జయప్రకాశ్ నారాయణ్ నియంత్రత్వం లేని దేశం అనే దార్శనికతతో ఆ ఉద్యమానికి నాయకత్వం వహించారన్నారు. అక్కడి నుంచి ప్రారంభమైన ఉద్యమం దేశవ్యాప్తంగా యువ మనస్సులను ఏకంచేసే స్థాయికి చేరిందన్నారు. ఏబీవీపీ నాయకత్వంలో వేలాది మంది విద్యార్థులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగరాజ్ బటగేరా, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.భరత్, కార్యకర్తలు బసవ, కిరణ్‌గౌడ, దిలీప్, దర్శన్, సాయి రూపాలిక, రమ్యకృష్ణ, శివాని, హర్షిత్, రాఘవ,రాఘవరెడ్డి పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

● బళ్లారి నాగరిక పోరాట సమితి డిమాండ్



మాట్లాడుతున్న సోమశేఖర్‌గౌడ, డాక్టర్ ప్రమోద్

బళ్లారి సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలో కనీస సౌకర్యాలు కల్పించాలని బళ్లారి నాగరిక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సమితి నాయకులు సోమశేఖర్‌గౌడ, డాక్టర్ ప్రమోద్ గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో నగరంలో తాగునీటి కుళాయిల్లో మురుగునీరు కలవకుండా నిరోధించాలని, రింగ్‌రోడ్డు నిర్మాణం, మోతి వంతెన వెడల్పు, సుధా క్రాస్ మెయిన్ వంతెన పూర్తి చేయడం తదితర అత్యవసర పనులను చేపట్టకుండా నగరంలోని ప్రతి చోటా వివిధ పనులు ప్రారంభించడమేంటని ప్రశ్నించారు. ఒక పని పూర్తయిన తరువాత మరొక పని ప్రారంభించకుండా అశాస్త్రీయమైన పద్ధతుల్లో పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనివల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందన్నారు. నగరంలో ప్రాథమిక సౌకర్యాలను తగిన విధంగా అందించాలని డిమాండ్ చేస్తూ 30 నుంచి జూలై 23వరకు కౌల్‌బజార్, మోతి సర్కిల్, దుర్గమ్మగుడి, రాయల్ సర్కిల్ సహా నగరంలోని వివిధ ప్రదేశాలలో లక్ష సంతకాల సేకరణ ద్వారా బళ్లారి పౌర పోరాట కమిటీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్లు నరసప్ప, ముర్తజ్‌సాబు, ఎస్‌యూసీఐ గోవింద పాల్గొన్నారు.

రైతులకు జొన్నల కొనుగోలు కేంద్రం ఉపయోగకరం



ఎమ్మెల్యే గణేష్‌కు మెమెంటో అందిస్తున్న రైతులు, నాయకులు

కంప్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నెముక లాంటి రైతులకు జొన్నలు కొనుగోలు కేంద్రం సకాలంలో ప్రారంభించడం వల్ల ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ అన్నారు. ఈసారి రైతులు కనీస మద్దతు ధర పొందడం ద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యారన్నారు. ఎమ్మిగనూరు గ్రామంలో గురువారం ఏపీఎంసీ ఆవరణలో జొన్నలు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు కురుగోడు రహదారి ఇప్పటికే అభివృద్ధి చేశామన్నారు. రాబోయే రెండేళ్లలో ఈ ప్రాంతంలోని రోడ్డు పూర్తిగా అభివృద్ధి చేస్తామన్నారు. కూరగాయల మార్కెట్ అభివృద్ధికి రూ.2 కోట్లు గ్రాంట్ ఇచ్చామన్నారు. రాబోయే రోజుల్లో ఎమ్మిగనూరు ఏపీఎంసీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. తమ సామర్థ్యానికి మించి పని చేయడానికి రైతుల సహకారం అవసరమన్నారు. పంట కోత సమయంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే రైతులకు ప్రయోజనకరంగా వుంటుందన్నారు. స్థానిక రైతులు మధ్యవర్తుల ప్రభావంతో సమస్యలను ఎదుర్కొంటున్నామని గమనించారన్నారు. కంప్లి ఏపీఎంసీ అధ్యక్షుడు హబీబుర్ రెహమాన్, పంచాయతీ అధ్యక్షురాలు శారద, జడేమూర్తి, గాదెలింగప్ప, ఖాసీంసాబ్, అల్లాసాబ్, మూకయ్యస్వామి, ధనలక్ష్మి, సదాశివయ్య పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా: ఎమ్మెల్యే భరత్‌రెడ్డి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దేవాలయాల పదాధికారులు

బళ్లారి సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు రుణపడి ఉంటానని, మీ సేవకుడిగానే కొనసాగుతానని నగర ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డి అన్నారు. నగరంలోని ఒక ప్రైవేట్ హోటల్లో హిందూ సమాజం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆశీస్సులతో కనకదుర్గమ్మ దేవత, కోటేమల్లేశ్వర స్వామి ఆశీస్సులతో ఎమ్మెల్యే కాగలిగానన్నారు. సంపాదించిన డబ్బు కాదు, చేసిన సామాజిక సేవే నన్ను ఈస్థాయికి తీసుకువచ్చిందన్నారు. నాన్న మార్గనిర్దేశంతో నడుస్తున్నాని అన్నారు. హిందూ సమాజం తరఫున గ్రాంట్లు పొందిన 24దేవాలయాల నాయకులు భరత్‌రెడ్డిని సన్మానించి సత్కరించారు. వేదికపై డిప్యూటీ మేయర్ సుకుమ్, మున్సిపల్ సభ్యులు నూర్ మహ్మద్, పి.గాదెప్ప, ప్రభంజన్‌కుమార్,ర రామాంజనేయ, పేరం వివేక్, ఉమాదేవి, జానకమ్మ, హొన్నప్ప, మంజుల, మాజీ మేయర్ నాగమ్మ, చంపా చవాన్, సిద్దేశ్, యశోధ పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు



బళ్లారి రోడ్డు బండిగేటు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

కంప్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నేరాల అదుపునకు ప్రధాన కూడళ్లలో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పోలీసులు ముందుచూపు, నేరాలను నియంత్రించడంలో ఉపయోగపడతాయి. గతంలో సీసీ కెమెరాలు ఇంట్లోకి చొరబడటం, బైకు దొంగతనం, దోపిడీ, హత్య తదితర నేరాలు నగరంలోని జరిగేవి. నేరస్థుల గుర్తింపును, ఆధారాలు సేకరించడంలో పోలీసులకు కష్టంగా మారింది. పట్టణంలో రోజు రోజుకి దొంగతనాలు ఎక్కువ జరుగుతుండటంతో మున్సిపాలిటీ నిధులు రూ.17 లక్షల వ్యయంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఎనిమిది సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

హోసూరు జోన్

పూలతోటల పరిశీలన



పూల తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా శూలగిరి పంచాయతీ యూనియన్ పరిధిలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 17.65 లక్షల అభివృద్ధి పనులను కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వయంగా పరిశీలించారు. చన్నపల్లి గ్రామానికి చెందిన గౌరమ్మ తన పొలంలో 0.70 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.77,995తో సబ్సిడీతో బిందు సేద్యం ద్వారా మిరప, తమలపాకు, టమోటా వంటి ఉద్యానవన పంటలను సాగు చేశారు. సుమనపల్లిలో జాతీయ ఉద్యానవన ఉద్యమం తరఫున రైతు సుకున 650 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 50శాతం సబ్సిడీతో గ్రీన్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. 16.88 లక్షలవిలువైన జర్బెరాను నాటారు. ఉద్యానవన శాఖ అందిస్తున్న పూల పెంపకం, కోత, మార్కెటింగ్, సాంకేతిక సహాయం గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఇతర గ్రామాలలో సబ్సిడీ ప్రయోజనాలు పొందిన రైతుల పూలతోటలను పరిశీలించారు. ఇదేసందర్భంగా 15మంది రైతులకు వరి విత్తనాలు, బయో ఎరువులు, మిరప మొలకలు, మెంతి విత్తనాలతోపాటు వ్యవసాయ ఇన్‌పుట్‌లను అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కవిత, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పచ్చయ్యప్పన్, ఉద్యానవనశాఖ జాయింట్ డైరెక్టర్ ఇందిర, ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జెన్నిఫర్, వ్యవసాయ ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై జాగృతి



మాట్లాడుతున్న ఎస్ఐ రామమూర్తి

హోసూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై హోసూరు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో గురువరం ప్రత్యేక జాగృతి కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ మాదకద్రవ్యాల నియంత్రణ దినంలో భాగంగా ప్రత్యేక జాగృతి చేపట్టారు. యూత్‌రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై రామమూర్తి మాట్లాడుతూ ప్రత్యేకించి యువత మాదకద్రవ్యాలకు, సిగరెట్, బీడీ, గంజాయి, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పాకియమణి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తెలియచేశారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల యూత్ రెడ్‌క్రాస్ సొసైటీ కో-ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకే నాలుగేళ్ల సాధనపై సమావేశం



మాట్లాడుతున్న మేయర్ సత్య

హోసూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వ నాలుగేళ్ల సాధనపై ప్రత్యేక సమావేశం, డీఎంకే నేత కరుణానిధి జయంతిని నిర్వహించారు. డీఎంకే యూత్ సిటీ నార్త్ రీజియన్ తరఫున హోసూరులో బహిరంగసభ న్విహించారు. హోసూరు కార్పొరేషన్ మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, జిల్లా యూత్ సిటీ సుమన్, కౌన్సిలర్‌లు, కన్నన్, నాగరాజ్ తదితరులు ప్రసంగించారు. రాష్ట్రంలో డీఎంకే పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పార్టీ పదాధికారులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.